

లాభాల మునగ

మునగ సాగుతో ఆశించిన దిగుబడులతో పాటు లాభాలు ఆర్జించవచ్చని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.
8లో▸



రాజ్యాధికారమే లక్ష్యంగా..

బీసీలు సంఘటితమై రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగాలని బీసీ సేన నాయకుడు బర్క కృష్ణ పేర్కొన్నారు.
8లో▸



పొదుపు సంఘంలో చేర్చాలి

ప్రతి మహిళను పొదుపు సంఘంలో చేర్పించాలని డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ నర్సింలు అన్నారు.
8లో▸

పొడిగింపా.. తొలగింపా?

పీఏసీఎస్‌లకు ఈ నెల 14తో ముగుస్తున్న గడువు



యాచారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం

- మరో ఆరునెలలు పొడిగించాలంటున్న పాలకవర్గాలు
- వెంటనే రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలంటున్న ఆశావహులు
- కొనసాగుతున్న ఉత్కంఠ.. ప్రభుత్వం నుంచి ఇంకా రాని స్పష్టత

యాచారం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)కు సర్కార్ పొడిగించిన ఆరు నెలల పదవీ కాలం గడువు ఈ నెల 14తో ముగియనుంది. మరో ఆరు నెలలు పొడిగిస్తారా.. లేదా అనే విషయమై ఇప్పటికీ స్పష్టత లేదు. పీఏసీఎస్‌లకు 2020 ఫిబ్రవరి 15న ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 16న చైర్మన్లను ఎన్నుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16తో ఐదేళ్ల పదవీ కాలం ముగిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఆరు నెలల పదవీ కాలాన్ని పొడిగించింది. పొడిగించిన పదవీ కాలం మరో రెండు రోజుల్లో ముగిసే అవకాశం ఉన్నప్పటికీ ఏ నిర్ణయం వెలువడకపోవడంతో అటు అధికారులు, ఇటు పాలకవర్గ సభ్యుల్లో ఉత్కంఠ నెలకొంది. మరో ఆరు నెలల గడువు పొడిగించాలా.. లేదా పాలకవర్గాలను రద్దు చేసి పీఏసీఎస్, డీసీసీబీ చైర్మన్లను నామినేటెడ్ పద్ధతిలో నియమించాలా అనే విషయమై ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఆరు నెలలు పొడిగించాలని డీసీసీబీ డైరెక్టర్లు ఇటీవల వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి విన్నవించారు.

మరో 15 కొత్తవి ఏర్పాటు!

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 56 పీఏసీఎస్‌లు ఉన్నాయి. 56 చైర్మన్లలో 16 మందిని డీసీసీబీ (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు)కి డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. మరో ఇద్దరు నామినేటెడ్ డైరెక్టర్లతో కలిపి మొత్తంగా 18మంది డైరెక్టర్లు ఉంటారు. వీరంతా డీసీసీబీ చైర్మన్‌తో పాటు, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. డీసీసీబీ ద్వారా మండల స్థాయిలో ఉన్న పీఏసీఎస్‌లకు రుణాలు అందజేస్తూ రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా కృషి చేయడం జరుగుతుంది. ప్రస్తుతం డీసీసీబీ రూ.3 వేల కోట్ల ఆర్థిక లావాదేవీలతో నడుస్తోంది. దాదాపు 1.25 లక్షల మందికి పైగా రైతులు సభ్యత్వం పొంది దీర్ఘకాలిక, స్వల్పకాలిక, బంగారు, వ్యక్తిగత రుణాలు పొందుతున్నారు. ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్‌లతో పాటు తాజాగా ఉమ్మడి జిల్లాలో మరో 15 కొత్తవి ఏర్పాటు చేసేందుకు సర్కార్ నిర్ణయించింది.

రాజకీయ రంగు

మండలాల స్థాయిలో జరిగే పీఏసీఎస్ డైరెక్టర్లు, చైర్మన్ల ఎన్నికల విషయంలోనూ రాజకీయ ప్రభావితం అధికంగా ఉంటుంది. పేరుకే రైతుల ఓట్లతో డైరెక్టర్లు గెలిచే అవకాశం ఉన్నప్పటికీ గ్రామాల్లో మాత్రం తీవ్ర పోటీ ఉంటుంది. రాజకీయ పార్టీలు తమ మద్దతుదారులను నిలబెట్టి పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తారు. రైతుల ఓట్లను కూడగట్టుకోవడం కోసం భారీగా ఖర్చు చేస్తారు. 2020లో జరిగిన ఎన్నికల సమయంలో అప్పటి సర్కార్‌లో ఎన్నికైన చైర్మన్లే అత్యధికంగా కొనసాగుతున్నారు. కొన్ని మండలాల్లో పదవి పోతుందనే భయంతో కొందరు చైర్మన్లు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిపోయారు. రుణాల అందజేత విషయంలో తమకు అనుకూలంగా ఉన్నవారికే ప్రాధాన్యత ఇస్తూ మద్దతు కూడగట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలోని ఆశావహులు మాత్రం పీఏసీఎస్‌ల పదవీ కాలాన్ని పొడిగించకుండా తక్షణమే ఎన్నికలు నిర్వహించేలా చూడాలని కోరుతున్నారు.

రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యం



పీఏసీఎస్‌లకు మరో ఆరు నెలల పదవీ కాలాన్ని పొడిగించాలని కోరుతున్నాం. ఉమ్మడి జిల్లా డీసీసీబీ రూ.3 వేల కోట్ల ఆర్థిక లావాదేవీలతో నడుస్తోంది. సర్కార్ అవకాశం ఇస్తే ఈ ఆరు నెలల్లో కొత్త పీఏసీఎస్‌లతో పాటు, డీసీసీబీ బ్యాంకులకు బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తాం. రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా కృషి చేస్తాం.

– కొత్తకుర్మ సత్తయ్య, డీసీసీబీ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా

న్యూస్‌రీల్

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలది కీలక పాత్ర అని ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరరహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐ విజయ్‌కుమార్, ఎస్‌ఐ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలకు పైగా ఎన్నో ఉద్యమాలు చేపట్టి సమస్యలు పరిష్కరించుకోగలిగామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్, నాయకులు సాయి చౌహాన్, రాహుల్, అరుణ్, ప్రకాష్, సునీల్, గణేశ్, అంకిత, నిఖిత, నందిని తదితరులు పాల్గొన్నారు.

విజయ పాలసేకరణ కేంద్రం ప్రారంభం

ఆమనగల్లు: మున్సిపల్ పరిధిలోని జంగారెడ్డిపల్లిలో పాడిపరిశ్రమ అభివృద్ధి సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయ పాలసేకరణ కేంద్రాన్ని మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో పాడిరైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శంకర్ పాల్గొన్నారు.

మేడిగడ్డతండా కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

ఆమనగల్లు: మండలంలోని మేడిగడ్డతండా కార్యదర్శి పి.వెంకటయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధుల దుర్వినియోగం, చట్టబద్ధమైన బాధ్యతలు నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహించినందుకు చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వెంకటయ్య మండల పరిధిలోని మంగళపల్లి ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శిగా పనిచేస్తూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఖాతాద్వారా రూ.2.55 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుని వాడుకున్నాడు. మేడిగడ్డతండాలో పన్నుల ద్వారా వచ్చిన రూ.76,875, కోనాపూర్ పంచాయతీలో పనిచేసిన సమయంలో రూ.16,342 ట్రెజరీలో జమచేయకుండా సొంతానికి వాడుకున్నట్లు గుర్తించారు. ఎంపీడీఓ ఇచ్చిన నివేదిక మేరకు వెంకటయ్యను సస్పెండ్ చేశారు.

ఆరుట్ల కార్యదర్శికి షోకాజ్ నోటీసు

మంచాల: మండలంలోని ఆరుట్ల పంచాయతీ కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్‌కు జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి సురేష్‌మోహన్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. పన్ను వసూళ్లలో అక్రమాలకు పాల్పడ్డాడని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాడని డీపీఓ కార్యాలయానికి ఫిర్యాదు అందింది. ఈ మేరకు వివరణ కోరుతూ మంగళవారం నోటీసు జారీ చేశారు. ఇదే విషయమై ఎంపీడీఓ బాలశంకర్‌ను వివరణ కోరగా నోటీసు వచ్చిన మాట వాస్తవమే అని తెలిపారు.

వర్షాల వేళ జాగ్రత్త



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం భారీ వర్షాలకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వాతావరణ శాఖ అలెర్ట్ ప్రకటించినందున ఆయా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తమ యాక్షన్ టీంలకు సంబంధించిన ఫీల్డ్ ఆఫీసర్లు, సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని తెలిపారు. కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసుకొని 24 గంటలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యుత్, రెవెన్యూ, పోలీసు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్‌శాఖలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రమాదకరంగా ఉండే నాలాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని, పాఠశాలలు, హాస్టళ్లతో పాటు పురాతన భవనాల్లోని సాధారణ పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరతలించాలన్నారు. భారీ వర్షాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఫంక్షన్ హాళ్లను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదకర చెరువులు, ప్రాజెక్టులను పరిశీలించి లీకేజీలు ఉంటే గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అన్నారు. షార్ట్ సర్క్యూట్ జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తం చేయాలన్నారు. యూరియా కొరత లేకుండా చూడాలని, ముందస్తుగా నిల్వ చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున వన మహోత్సవంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు నిర్మాణాలు పూర్తయిన వాటికి బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, డీవియేషన్‌తో నిలిచిపోయిన ఇళ్లకు సంబంధించి ప్రొసీడింగ్స్ ఇవ్వాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ సిస్టమ్ ఏర్పాటుకు ఈ నెల 16లోగా ప్రతిపాదనలు పంపాలన్నారు. వరదలు, ప్రమాదాలు సంభవిస్తే అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 79931 03347, 040 23237416కు సమాచారం అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ సంగీత , డీఆర్డీఓ పీడీ శ్రీలత , డీపీఓ సురేష్‌మోహన్, వ్యవసాయ శాఖ అధికారి ఉష, హౌసింగ్ పీడీ నాయక్, డీఈఓ సుశీందరావు, ఎస్సీ సంక్షేమ అధికారి రామారావు పాల్గొన్నారు.

అక్రమాలు సహించేది లేదు



రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఆమనగల్లు: రైస్‌మిల్లర్లు ప్యాడీరైస్, రైస్‌మిల్లర్ల నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హెచ్చరించారు. మండల పరిధి పోలెపల్లి గ్రామంలోని శ్రీరామ రైస్‌మిల్లులో మంగళవారం సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ, డీఎస్పీ రమణారెడ్డి, సీఐ అజయ్, ఎస్‌ఐ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, టీఏ జంగయ్య ఆధ్వర్యంలోని బృందం ఆకస్మిక తనిఖీ నిర్వహించింది. ఈ తనిఖీల్లో 2022–23 రబీ సీజన్‌కు సంబంధించిన ప్యాడీరైస్ 33,47,960 క్వింటాళ్ల కేటాయింపు కాగా ప్రస్తుత తనిఖీల్లో 19,80,130 క్వింటాళ్లు తక్కువగా వచ్చినట్లు గుర్తించామని అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ తెలిపారు. తక్కువగా వచ్చిన ప్యాడీరైస్ విలువ రూ.7.10 కోట్లు ఉంటుందన్నారు. అక్రమాలకు పాల్పడిన మిల్లు యజమానిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులకు సిఫారసు చేసినట్లు పేర్కొన్నారు. లక్ష్మీ వెంకటసాయి రైస్‌మిల్లులోనూ తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. అక్రమాలకు పాల్పడే రైస్‌మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు మిల్లులు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా తిరంగా



కందుకూరు మండల కేంద్రంలో మంగళవారం తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి భారీ జాతీయ పతాకంతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకుడు అందెల శ్రీరాములుయాదవ్, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి బూర దిలీప్‌గౌడ్, రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ ఊటు మహేందర్ తదితరులు పాల్గొన్నారు. – కందుకూరు

కుంటలో ‘వైకుంఠం’



మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లిలో ఐదేళ్ల క్రితం వైకుంఠధామం నిర్మించారు. అనాలోచిత నిర్ణయాలతో గ్రామంలోని మాల కుంటలో నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం వర్షాలు బాగా కురవడంతో కుంట పూర్తిగా నిండిపోయింది. వైకుంఠధామంలోకి వెళ్లడానికి వీలులేకుండా పోయింది. ఇటీవల గ్రామంలో ఓ వ్యక్తి మరణిస్తే రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో అంత్యక్రియలు పూర్తిచేయాల్సి వచ్చింది. – మొయినాబాద్

రైతు సంక్షేమమే ధ్యేయం



గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

హయత్‌నగర్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో కొహెడలో నిర్మించిన ఆధునిక గోదాంను మంగళవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకుని, సరైన ధర వచ్చినప్పుడు అమ్ముకునేందుకు వీలుగా ప్రభుత్వం ఆధునిక గోదాంలు నిర్మిస్తోందని తెలిపారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసాతో పాటు వరి పంటకు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్‌లు వంగేటి లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, చేపల యాదగిరి, కృష్ణారెడ్డి, కొండ్రు స్వప్న, శ్రీనివాస్, చెక్క లక్ష్మమ్మ, శీలం లక్ష్మమ్మ, సీఈఓ రాందాస్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఉష

మొయినాబాద్: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి ఉష అన్నారు. మొయినాబాద్ రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంటలకు పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు, మందులను వాడాలని తెలిపారు. వ్యవసాయ యంత్రీకరణ పరికరాలు అందుబాటులో ఉన్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు బీమా పథకం కోసం 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న రైతులు అర్హులని.. వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాల ప్రయోజనాలు పొందాలంటే రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయించుకోవాలన్నారు. యూరియా, ఇతర ఎరువులు రైతులకు సరిపడా అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏడీఏ సురేష్‌బాబు, మండల వ్యవసాయాధికిరి అనురాధ, ఏఈఓ సునీల్ పాల్గొన్నారు.

జంట జలాశయాలకు తగ్గిన వరద

సాక్షి, సిటీబ్యూరో: జంట జలాశయాలకు వరద తగ్గుముఖం పట్టింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వారం రోజులుగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌కు వరద ప్రవాహం కొనసాగింది. ఉస్మాన్‌సాగర్ జలాశయంలోకి పరీవాహక ప్రాంతాలైన చేవెళ్ల, వికారాబాద్, శంకర్‌పల్లి, మొమిన్‌పల్లి, దోబీపేట్ ప్రాంతాల్లో కురిసే వర్షం నీరు మూసీ నది ద్వారా చేరుతోంది. హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌కు చేవెళ్ల, అందాపూర్, కొత్వాల్‌పేట్, నర్కూడ, తాండూరు, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో కురిసే వర్షం నీరు ఈసీ నది ద్వారా జలాశయానికి వస్తోంది. మంగళవారం నాటికి ఉస్మాన్ సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. హిమాయత్‌సాగర్ జలాశయంలోకి వరద నీరు ఈసీ వాగు మీదుగా వస్తుండటంతో రెండు రోజుల క్రితం జలమండలి అధికారులు ఐదు క్రస్టు గేట్లు అడుగు మేర ఎత్తి నీటిని ఈసీ నదిలోకి వదిలారు. మంగళవారం వరద ప్రవాహం తగ్గడంతో నాలుగు క్రస్టు గేట్లను మూసివేసి ఒక గేటు నుంచి మాత్రమే నీటిని దిగువకు వదులుతున్నారు.

నవ్విపోదురుగాక!



ముర్తూజగూడ రెవెన్యూలో కొనసాగుతున్న 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు

- అధికారుల అనాలోచిత నిర్ణయాలు
- ముర్తూజగూడలో ఇప్పటికే సబ్‌స్టేషన్ పనులు షురూ
- తాజాగా శంకుస్థాపన పేరుతో హడావుడి
- స్థానికుల అభ్యంతరంతో శిలాఫలకంలో పేరు మార్పు
- ఇటీవల తుక్కుగూడలోని ఆస్పత్రికీ ఇదే తరహా శంకుస్థాపన
- నిర్లక్ష్యంతో విమర్శలు మూటగట్టుకుంటున్న వైనం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అధికారుల అనాలోచిత నిర్ణయాలు విస్తుగొలుపుతున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రులు పాల్గొనే అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలోనూ అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. తుక్కుగూడలో కనీసం భూమి కూడా కేటాయించని ఓ ప్రభుత్వ ఆస్పత్రికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా ఇప్పటికే శంకుస్థాపన చేయించి నవ్వులపాలయ్యారు. తాజాగా మొయినాబాద్‌లో మరో వివాదానికి కారణమయ్యారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై.. ఏకంగా పనులు చివరి దశకు చేరుకున్న సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన పేరుతో హడావుడి చేయడం గమనార్హం. సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరైన కార్యక్రమాన్ని సైతం నిర్లక్ష్యంగా రూపకల్పన చేయడం విమర్శలకు తావిస్తోంది.

ఏడాదిన్నరక్రితమే పనులు షురూ

మొయినాబాద్ పరిసర గ్రామాల్లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ముర్తూజగూడలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రూ.8 కోట్లు మంజూరు చేసింది. అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో శంకుస్థాపన పనులు నిలిచిపోయాయి. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు ఏడాదిన్నర క్రితమే దీనికి భూమి పూజ చేసి, నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ప్రస్తుతం ఆయా పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. తాజాగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమానికి గత సోమవారం ఏర్పాట్లు చేయడం, స్థానికులు అధికారులను నిలదీయడం వివాదాస్పదంగా మారింది. చివరికి అధికారులు శిలాఫలాకాలపై పేర్లు మార్చి ఇతర సబ్‌స్టేషన్ల పేరుతో అదే వేదికగా శంకుస్థాపన చేయాల్సి వచ్చింది.

అసలేమైందంటే..?

చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 30 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. 1,02,811 గృహ, 24,969 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ కొత్తగా అనేక గృహ, వాణిజ్య, పారిశ్రామిక సముదాయాలు వెలుస్తున్నాయి. విద్యుత్ వినియోగం రెట్టింపవుతోంది. సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్యను నియంత్రించడంతో పాటు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కొత్తగా మరో ఐదు సబ్‌స్టేషన్లు మంజూరు చేసింది. రూ.20.5 కోట్ల అంచనా వ్యయంతో వీటిని నిర్మించతలపెట్టింది. వీటిలో చిలుకూరు (నాగిరెడ్డిగూడ), బాకారం, నర్రెగూడలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. కొత్తగా నిర్మించదలచిన ప్రదేశంలో కాకుండా ఇప్పటికే మంజూరై, పనులు వివిధ దశల్లో కొనసాగుతున్న ముర్తూజగూడలో ఆయా సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ముర్తూజగూడలో రూ.8 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన సబ్‌స్టేషన్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. పనులు ప్రారంభమైన ప్రదేశంలోనే మళ్లీ శంకుస్థాపన అంటూ అధికారులు హడావుడి చేయడం, మీడియాకు ఆహ్వానాలు పంపడం, స్థానికులు అడ్డుతగలడం, తర్వాత మేల్కొని శిలాఫలకాలు మార్చడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమించాలి



సర్దార్‌నగర్‌లో నియామకపత్రం అందజేస్తున్న బర్క కృష్ణ

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ

షాబాద్: జనాభాలో సగ భాగమైన బీసీలు సంఘటితమై రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో బీసీ సేన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రమేశ్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా రాము, ప్రధాన కార్యదర్శిగా యాదయ్యగౌడ్ తదితరులను సభ్యులుగా ఎనుకున్నారు. సర్దార్‌నగర్‌లో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కాసముని మల్లేశ్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలు ఐకమత్యంతో ఉంటూ ముందుకు సాగాలన్నారు. దేశ వ్యాప్తంగా బీసీలను చైతన్యం చేసి గ్రామ స్థాయి నుంచి బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మించి హక్కులను సాధించుకోవాలన్నారు. బీసీ సేన రాజకీయ పార్టీలకతీతంగా పని చేస్తుందన్నారు. చట్ట సభలో దామాషా ప్రకారం రిజర్వేషన్లు సాధించేంత వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహులు, బీసీ సేన జిల్లా, మండల సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను పొదుపు సంఘంలో చేర్చాలి

కొందుర్గు: ప్రతి మహిళను పొదుపు సంఘంలో చేర్పించాలని డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ నర్సింలు అన్నారు. మంగళవారం మండల సమాఖ్యలో మహిళా సంఘాల సభ్యురాళ్లకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ.. గ్రామాల్లో 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల మహిళలందరినీ స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలన్నారు. దివ్యాంగులు, వృద్ధ మహిళా సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సర్కారు లక్ష్యమన్నారు. మహిళల జీవనోపాదులను మెరుగు పర్చుకొని మహిళలు ఆర్థికంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భారతమ్మ, ఉపాధ్యక్షురాలు ఎ.భారతమ్మ, కోశాధికారి లక్ష్మీనర్సమ్మ, సీసీ లక్ష్మి, సరళ, జంగయ్య, నర్సింలు వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.



కొందుర్గులో మహిళలకు శిక్షణ ఇస్తున్న డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ నర్సింలు

కోర్టు ఆదేశాలు బేఖాతరు

నిందితుడికి నాన్‌బెయిల్‌బుల్ వారెంట్

కడ్తాల్: కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. సీఐ గంగాధర్ వివరాల ప్రకారం.. 2019లో మండలంలోని నార్లకుంట తండాకు చెందిన జాటవత్ రూప్‌సింగ్, అతని భార్య రజిత గొడవపడ్డారు. ఈ మేరకు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. నిందితుడిగా ఉన్న ఆయన్ని కోర్టుకు హాజరుకావాలని ఆమనగల్లు కోర్టు సమన్లు జారీ చేసింది. సమన్లు తీసుకున్న ఆయన కోర్టుకు హాజరుకాలేదు. దీంతో జడ్జి నిందితుడికి నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేశారు. మేరకు పోలీసులు నిందితుడిని మంగళవారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ మేరకు జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మాడ్గుల: అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాడ్గుల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. దోడ్లపహాడ్‌కు చెందిన జంగయ్యగౌడ్ (38)నగరంలో ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల అప్పుల బాధలు ఎక్కువ కావడంతో ఇంటికి వచ్చాడు. సోమవారం తన పొలానికి పురుగుల మందు తాగాడు. అక్కడికి వెళ్లిన భార్యాపిల్లలు ఇది గమనించి చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

లాభాల మునగ

పంటలో సస్యరక్షణ చర్యలే కీలకం

- నీటి వసతి నేలలు అనుకూలం
- కృషి విజ్ఞాన కేంద్రం నిపుణుడు శ్రీకృష్ణ



కందుకూరు: మునగ పంట సాగుకు మన రాష్ట్రంలోని నేలలు అనుకూలం. దీంతో ఆశించిన మేర దిగుబడులతో పాటు మంచి లాభాలు అర్జించవచ్చు. అలాగే ఇందులో పోషక విలువలు సైతం సమృద్ధిగా ఉండడంతో ఏ సీజన్‌లోనైనా డిమాండ్ ఉంటుంది. జిల్లాలో రెండు వేల ఎకరాలకు పైగానే మునగ సాగు చేస్తున్నారు. ఈ పంట సాగులో మెలకువలు, చేపట్టాల్సిన అంశాలు, సస్యరక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

నేలలు

నీరు నిలవని ఎర్ర, ఇసుక, ఒండ్రు మట్టి నేలలు మునగ సాగుకు అనుకూలమైనవి. నీటి వసతి ఉండి సారవంతమైన భూముల్లో అధిక దిగుబడి సాధించవచ్చు.

రకాలు

తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు విడుదల చేసిన పీకేఎం–1 రకం మునగ సాగుకు అనుకూలమైంది. ఇది నాటిన ఆరు నెలల్లో కాపునకు వచ్చి రెండు సంవత్సరాల్లో మూడు కాపులనిస్తుంది. కాయలు పొడవుగా మంచి కండ కలిగి ఉంటాయి. ఎగుమతికి అనుకూలమైనవి.



మునగ తోట

మొక్కల పెంపకం

సేకరించిన విత్తనాన్ని కిలోకు 2–3 గ్రాముల కాప్టాన్ లేదా మాంకోజెబ్‌తో విత్తన శుద్ధి చేయాలి. రెండు పాళ్లు మంచి ఎర్రమట్టి, ఒక భాగం ఇసుక, ఇంకో భాగం బాగా చివికిన పశువుల ఎరువు కలిపిన మిశ్రమాన్ని 4x6 సైజులో కింద భాగంలో తగినన్ని రంధ్రాలు గల 150 గేజ్ మందం గల పాలిథిన్ సంచులలో నింపాలి. ఈ సంచుల్లో విత్తనాన్ని అంగుళం లోతులో విత్తాలి. ప్రతి రోజు నీరు పెట్టాలి. వర్షాకాలంలో పాదులో నేరుగా కూడా విత్తనాన్ని పెట్టవచ్చు. నాటిన 10–12 రోజుల్లో విత్తనం మొలకెత్తుతుంది. ఒక ఎకరాకు 300 గ్రాముల విత్తనం సరిపోతుంది. విత్తనాలను పాలిథిన్ సంచుల్లో విత్తినప్పుడు 40 రోజుల్లో మొక్కలు తోటలో నాటడానికి సిద్ధమవుతాయి.

నాటడం

పొలాన్ని దున్ని కలుపు లేకుండా శుభ్రం చేయాలి. 2.5x2.5 మీటర్ల దూరంలో అడుగు లోతు, అడుగు వెడల్పుతో గుంతలు తీసి, తవ్విన మట్టిని భూసారాన్ని బట్టి 5–10 కిలోల మాగిన పశువుల ఎరువు, 200 గ్రాముల సూపర్, 25 గ్రాముల 4 శాతం ఎండోసల్ఫాన్ పొడి మందు కలిపి గుంతలు పూడ్చి అందులో మొక్కల్ని నాటి నీరు పెట్టాలి.

నీరు కట్టడం

మొక్క పెరిగే దశలో 8–10 రోజులకోసారి, పూత, కాయదశలో 6–7 రోజులకోసారి అవసరాన్ని బట్టి నీటి తడి ఇవ్వాలి. డ్రిప్పు ద్వారా రోజు విడిచి రోజు 10–15 లీటర్ల నీరు ఇవ్వాలి.

ఎరువులు

పిందె పడిన దగ్గర నుంచి 25–30 రోజులకోసారి చెట్టుకి 75–100 గ్రాముల 17:17:17 ఎరువును వేయాలి. దీంతో కాయ పరిమాణం పెరుగుతుంది.

సస్యరక్షణ

పూతదశలో చీడపట్టకుండా 10 లీటర్ల నీటికి 20 మి.లీ రోగార్, 2 గ్రాముల మాంకోజెబ్, 2 మి.లీ ప్లానోఫిక్స్ కలిపి పిచికారీ చేయాలి. పిందె దశలో ఫ్రూట్‌టాప్ ఆశించకుండా 2 మి.లీ మలాథియాన్ మందును లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలి. ఈగ ఆశించి నల్లబడిన పిందెలను, కాయలను ఎప్పటికప్పుడు కోసి తొలగించాలి.

దేవాలయాలకు రక్షణ కల్పించాలి

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహయాదవ్



పోలీసుల అదుపులో నాయకులు

కేశంపేట: రాష్ట్రంలోని హిందూ దేవాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పసుల నర్సింహయాదవ్ అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద పాక్షికంగా గోడను ధ్వంసం చేయడంతో బీజేపీ పిలుపు మేరకు చలో పెద్దమ్మతల్లి కార్యక్రమంలో భాగంగా మంగళవారం కుంకుమార్చన నిర్వహించేందుకు పార్టీ నాయకులు సిద్ధమయ్యారు. దీంతో కేశంపేట పోలీసులు మండలంలో పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి.. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిర్వహించ తలపెట్టిన చలో పెద్దమ్మతల్లి కార్యక్రమాన్ని అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో హిందువులకు, దేవాలయాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక సంస్థల మండల కన్వీనర్ కంచుకోట మహేశ్, సంస్కృతిక శాఖ జిల్లా కో–కన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కల్వకోలు తిరుపతి, దాసరి యాదయ్య, కోటి, సురేష్, మహేశ్, మల్లేశ్ తదితరులను పోలీసులు అరెస్టు చేసి, విడుదల చేశారు.

వివాహిత అదృశ్యం



గీత (ఫైల్)

కేశంపేట: ఓ వివాహిత అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో వెలుగు చూసింది. వివరాలు ఉన్నాయి. గ్రామానికి చెందిన సంపంగి మల్లేశ్‌కు కల్వకుర్తి మండలం సిలార్‌పల్లి గ్రామానికి చెందిన గీతతో గతేడాది వివాహం జరిగింది. అయితే గీత రాఖీ పండగకు పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

మణికొండ: ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతూ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థిని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగిలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్ జిల్లా అక్కునూరు గ్రామానికి చెందిన బి.సుస్మిత (18) ఇబ్రహీంబాగ్‌లోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతుంది. నార్సింగిలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో మరో ఇద్దరితో కలిసి ఉంటుంది. సోమవారం రూమ్‌మేట్ అర్చన కిందకు వెళ్లగా.. గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. అర్చన తిరిగి వచ్చి తలుపు తెరిచేందుకు ప్రయత్నించగా లోపల గడియ వేసి ఉంది. దీంతో వార్డెన్ నవీనకు విషయం తెలిపింది. ఇద్దరు వచ్చి డోర్‌ను తెరిచి చూడగా సుస్మిత ఆత్మహత్య విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే 108కు ఫోన్ చేయటంతో వారు వచ్చి ఆమె మృతిచెందినట్లు ధృవీకరించారు. హాస్టల్ నిర్వాహకుడు సాయికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మేడ్చల్ రూరల్: బైక్‌పైన వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..ఏపీలోని తెనాలి జిల్లా వేమూరు మండలం చంపాడు గ్రామానికి చెందిన కేసాని మధు(50) బతుకుదెరువు కోసం మేడ్చల్ వలస వచ్చాడు. కేఎల్‌ఆర్ వెంచర్‌లో నివాసం ఉంటూ మేడ్చల్ పారిశ్రామిక ప్రాంతంలోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులకు వెళ్లిన మధు మంగళవారం ఉదయం 8.45 గంటలకు ఇంటికి బైక్‌పై బయల్దేరాడు. మేడ్చల్‌లోని వివేకానంద విగ్రహం వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ బైక్ కుడివైపు ఉన్న హ్యాండిల్‌కు తగలడంతో మధు లారీ చక్రాల కిందకు పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన వ్యక్తులు

షాబాద్: వీధి కుక్కల దాడిలో ఐదుగురు గాయపడిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన మూషని సత్తయ్య, తుపాలకు సత్తయ్య, మేదరి కృష్ణయ్యలతో పాటు మరో ఇద్దరిపై సంతలో కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వారిని షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించినట్లు గ్రామస్తులు చెప్పారు. రోజు రోజుకు వీధి కుక్కలు దాడి చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఒకే రోజు ఐదుగురిపై దాడులకు తెగబడడంతో బెంబేలెత్తిపోతున్నారు. చిన్న పిల్లలను స్కూల్‌కి పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువ రైతు మృతి

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువ రైతు మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శివకుమార్(22)కు కొంత వ్యవసాయ పొలం ఉంది. ఉదయం పొలం పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఆయన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శివకుమార్‌కు తీవ్రంగా గాయాలై మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

ఇబ్రహీంపట్నం: ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు మండలం కొనలుగూడకు చెందిన మారేశ్‌కన్న(50) శేరిగూడలోని హోండా షోరూంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని రాత్రి బైక్‌పై ఇంటికి వెళుతుండగా ఎలిమినేడు గ్రామ శివారులో అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయమై మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన మహిళా ఉద్యోగి

- కలెక్టరేట్ ఈ– సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నిందితురాలు
- రైతు నుంచి రూ.15,000 లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్ సుజాత

వికారాబాద్: లంచం తీసుకుంటూ ఓ మహిళా ఉద్యోగి ఏసీబీ అధికారులకు చిక్కింది. కలెక్టరేట్‌లో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నవాబుపేట మండలం వట్టిమీనపల్లికి చెందిన ఓ రైతు తన రెండెకరాల అసైన్డ్ భూమికి సంబంధించి రికార్డుల్లో తన తల్లి పేరు నమోదు చేయించేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. తహసీల్దార్ కార్యాలయం నుంచి వచ్చిన ఫైల్‌ను ఈ– సెక్షన్ నుంచి కలెక్టర్ పేషీకి పంపించాల్సి ఉంది. ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సుజాత ఇందుకోసం రూ.5 వేలు డిమాండ్ చేసింది. ఈ మొత్తాన్ని పదిహేను రోజుల క్రితమే రైతు నుంచి గూగుల్ పే చేయించుకుంది. అనంతరం కలెక్టర్ ప్రొసీడింగ్ ఇవ్వగా.. తిరిగి ఆ కాపీని తహసీల్దార్ ఆఫీసుకు పంపించాల్సిఉంది. రోజులు గడుస్తున్నా ఫైల్ రాకపోవడంతో బాధితుడు వెళ్లి జూనియర్ అసిస్టెంట్ సుజాతను కలిశాడు. దీనిపై స్పందించిన ఆమె ప్రొసీడింగ్ కాపీ తహశీల్దార్ కార్యాలయానికి పంపాలంటే రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. రూ.15,000 బేరం కుదిరిన అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు సుజాతకు డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఆమెను పట్టుకున్నారు. ఈ– సెక్షన్‌లో సోదాలు నిర్వహించి, పలు ఫైళ్లను పరిశీలించారు. ఆమెను అదుపులోకి తీసుకుని, ఈ వ్యవహారంలో మరెవరి పాత్రయినా ఉందా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. నిందితురాలిని ఏసీబీ కోర్టులో హాజరు పర్చి, రిమాండ్‌కు తరలిస్తామని వెల్లడించారు.

లంచం అడిగితే 1064 కాల్ చేయండి..

అధికారులు, ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే తమను సంప్రదించాలని, ఇందుకోసం 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు చెప్పాలని ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టంచేశారు. అవినీతి రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఎల్లమ్మా.. బైలెల్లినాదో

- అంగరంగ వైభవంగా సూర్యగిరి వార్షికోత్సవాలు



ఘటం ఊరేగింపు



అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రెండోరోజు అమ్మవారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ క్రతువును చూడటానికి లక్షలాది భక్తులు, శివసత్తులు తరలివచ్చారు. అనంతరం అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన బోనాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. రావిర్యాల నుంచి ఆలయం వరకు అమ్మవారి ఘటం, శివసత్తులు, పోతురాజుల విన్యాసాలు, కళాకారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యేలు పి.సబితారెడ్డి, చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీరాములుయాదవ్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, మీగడ కాశీనాథ్, పాలక మండలి సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పల్లవి, శ్రీలత, అర్జున్, బాల్‌రాజ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి కల్యాణం జరిపిస్తున్న పురోహితులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నకిలీ డీ-మార్ట్ యాప్‌తో నిలువు దోపిడీ

బాధితుడి కార్డుల నుంచి రూ.1.31 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. సామాన్యులు వినియోగించే యాప్స్ పేరుతో నకిలీవి సృష్టిస్తున్నారు. లింకుల్లో ఏపీకే ఫైల్స్ ఉంచి నిలువుదోపిడీ చేస్తున్నారు. నిత్యావసర సరుకుల విక్రయానికి పేరెన్నికగన్న డీ–మార్ట్ పేరుతో నకిలీ యాప్ సృష్టించి నగరవాసుల్ని ముంచుతున్నారు. ఈ తరహా నేరాలు వరుసగా వెలుగుచూస్తున్నాయి. సరూర్‌నగర్‌కు చెందిన కొండా శ్రీనివాసులుకు ఈ నెల 10న ఓ సందేశం వచ్చింది. తక్కువ ధరకు వస్తువులు ఖరీదు చేయడానికి డీ–మార్ట్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అందులో ఉంది. అది నిజమైనదే అని భావించిన శ్రీనివాసులు లింక్ క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆ లింకులో ఉన్న ఏపీకే ఫైల్ ఆయన ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయిపోయింది. దీంతో ఫోన్ మొత్తం సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోయింది. ఇలా ఆయన ఫోన్ నుంచి క్రెడిట్ కార్డులను ఉపయోగించిన కేటుగాళ్లు మొత్తం 13 లావాదేవీల్లో రూ.1.31 లక్షలు కాజేశారు. ఓటీపీలు సైతం ఆ ఫోన్‌కే రావడంతో వారి పని సులువైంది. ఇలా వరుసగా ఓటీపీలు రావడాన్ని చూసిన బాధితుడు ఆయా కార్డులకు సంబంధించిన కస్టమర్ కేర్ సెంటర్లకు ఫోన్లు చేయించి బ్లాక్ చేయించారు. అప్పటికే పెద్ద మొత్తం కోల్పోయిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని నెంబర్లు, బల్క్ ఎస్సెమ్మెస్‌లు, వాట్సాప్ ద్వారా వచ్చిన సందేశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. వాటిలో ఏవైనా లింకులు ఉంటే మరింత అప్రమత్తంగా ఉండాలని...వాటి చివర డాట్ (.)ఏపీకే అని ఉంటే జాగ్రత్తగా డిలీట్ చేయాలని స్పష్టం చేస్తున్నారు. డిలీట్ చేసే క్రమంలో పొరపాటను వాటిని క్లిక్ చేసినా ఫోన్ మొత్తం సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోతుందని హెచ్చరిస్తున్నారు.